ఎండిన బావులు అడుగంటిన బోర్లు

భీమిలి జోన్‌లో తాగునీటికి కటకట



కార్మికవాడలో నీళ్లు లేక ఎండిపోయిన బావి



సంతపేటలో నీళ్లు లేక చెత్త కుండీగా బావి



తగరపువలస: బావులు ఎండిపోయి, బోర్లు అడుగంటిపోవడంతో చుక్క నీరు లేక జీవీఎంసీ 1,2 వార్డుల్లో సుమారు 8వేల మందికి పైగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూలై చివరివారంలోకి ప్రవేశించినా తగిన వర్షాలు లేక ఈ పరిస్థితి తలెత్తింది. ఏటా జూలై నాటికి సాధారణ వర్షపాతం నమోదు అయితే ఎగువ ప్రాంతాల నుంచి గోస్తని నదిలో వరద నీరు చేరుతుంది. తద్వారా నేలబావులు, బోరుబావులలో నీరు పుష్కలంగా చేరేది. ఈ ఏడాది జూలై కూడా వేసవిని తలపించడంతో మనుష్యులతో పాటు ప్రకృతి కూడా తల్లడిల్లిపోయింది. ఫలితంగా జీవీఎంసీ భీమిలి జోన్‌లో ముఖ్యంగా తగరపువలస దిగువ ప్రాంతాలైన చిట్టివలస, కొత్తపేట, వెలంపేట, విల్సన్‌పేట, సంతపేట, కార్మికవాడ ప్రాంతాలలో నీటి కరువు వచ్చినట్టుగా మారిపోయింది.

తిలా పాపం తలా పిడికెడు..


జీవీఎంసీలో తాగునీటి ఎద్దడికి విశ్లేషిస్తే పలువురు కారకులుగా కనిపిస్తున్నారు. విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినా జీవీఎంసీ భీమిలి జోన్ అవసరాల మేరకు తాగునీటిని నిల్వ చేసుకోలేకపోతున్నారు. ఈ ఏడాది రూ.6.4 లక్షలు ఖర్చు చేసి సామియ్యవలస వద్ద నదిలో ఇసుక బస్తాలు అడ్డు వేసినా, ఆ నీరు టి.నగరపాలెం దాటి ముందుకు రాలేకపోతోంది. ఇసుక బస్తాలతో నిలిపిన నీటిని పదుల సంఖ్యలో ప్రైవేట్ ట్యాంకర్ల యజమానులు సంగివలస-పాండ్రంగి రహదారిలో ఇష్టారాజ్యంగా మోటార్లతో భూమి నుంచి తోడేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. నదిని ఆనుకుని కూతవేటు దూరంలో భీమిలి ఆర్డీవో, భీమిలి, పద్మనాభం, ఆనందపురం తహసీల్దార్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నా అక్రమ నీటి వ్యాపారానికి కట్టడి చేయలేకపోతున్నారు. చిట్టివలస వద్ద జ్యూట్‌మిల్లు యాజమాన్యం వందేళ్ల క్రితం నిర్మించిన పూనిగట్టును పునరుద్ధరించాలని ఎంతసేపూ వాదించే ఈ ప్రాంత మేధావులు, ఓట్లు వేసి గెలిపించిన నాయకులను నదిపై చెక్‌డ్యామ్‌లు కట్టాలని నిలదీయలేకపోతున్నారు. 2014-2019 టీడీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తగరపువలస, చిట్టివలస నుంచి డ్రైనేజీలను నదిలోకి మళ్లించినా ఏ ఒక్కరూ అడ్డు చెప్పలేదు. నది నుంచి ఉప్పు ఇసుక సైతం తీసి విక్రయించే కూటమి నాయకులు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. జీవీఎంసీ కూడా జీవాధారమైన బావులు పూడుకుపోతున్నా కొన్నేళ్లగా పూడికతీతక పనులు చేపట్టలేదు. అలాగే అనుమతి లేకుండా పుట్టగొడుగుల్లా వీధికొక వాటర్ ప్లాంట్ వెలిసి, ఇష్టారాజ్యంగా నీటిని తోడేస్తున్నారు. ఇంకుడు గుంతల ఊసే ఎక్కడా కనిపించడం లేదు. దీంతో భీమిలి వాసులను నీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.



చిట్టివలసలో చుక్కనీరు ఇవ్వని బోరుబావి



గోస్తని నది వద్ద అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు



కొత్తపేటలో నీళ్లు లేక ఎండిపోయిన బావి

కుళాయిల నుంచి అరకొరగా నీటి సరఫరా

జీవీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేసే అరకొర నీరు సరిపోకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా నేలబావులు, బోరుబావులపై ఆధారపడుతున్నారు. వర్షాధారం కారణంగా నదిలో నీరులేక, దీనిపై ఆధారపడి ఉన్న బావులు, బోర్లు పూర్తిగా అడుగంటిపోయాయి. గతంలో మోటారు ద్వారా 6 నిమిషాలలో నిండే 500 లీటర్ల వాటర్ ట్యాంకు ఇప్పుడు 15 నిమిషాలు గడిచినా నిండటం లేదు. ఆ ట్యాంకు నిండిన నీరు కూడా మోటార్ల ద్వారా రావడానికి భూగర్భంలో నీరు లేదని చెబుతున్నారు. ఇళ్లలో బోర్ల పరిస్థితి ఇలా ఉంటే వీధి బోర్లు దాదాపు చుక్కనీరు ఇవ్వడం లేదు. వీధిబోర్లు తెరచి చూసినా ప్రయోజనం ఉండటం లేదని జీవీఎంసీ మెకానిక్‌లు చేతులు ఎత్తేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన బావుల్లో పూడిక తీయిస్తే తప్ప ఈ ప్రాంత ప్రజలకు ఉపశమనం కలగదని అంటున్నారు. మార్చి 15 తరువాత నాలుగు మాసాలుగా ఈ ప్రాంతంలో ఏచోట కొత్తగా బోరు నిర్మాణం జరిగినా 300 అడుగులకు వెళ్లినా నీరు పడటం లేదు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



అలంకవారి వీధిలో బోరుబావిలో నీరు లేక మొరాయిస్తున్న మోటారు

కుళాయిలు రాకపోతే అంతే సంగతి



జీవీఎంసీ కుళాయిల ద్వారా అంతో ఇంతో తాగునీరు సరఫరా చేస్తోంది. ఏదైనా అంతరాయం కలిగి కుళాయిల ద్వారా నీరు రాకపోతే ఇక అంతే సంగతులు. నాలుక పిడచకట్టుకు పోవలసిందే. ఇక పండగలు, ఫంక్షన్లు జరిగితే మా కష్టాలు ఆ దేవుడికే తెలియాలి.

–రంగూరి అమృతవాణి, చిట్టివలస

గోస్తని నదిని కాపాడుకుంటేనే ..



పూనిగట్టు నిర్మాణంతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. ముందుగా గోస్తని నదిని సంరక్షించుకోవాలి. వీలున్న రిజర్వాయర్, చెక్ డ్యామ్‌లు నిర్మించి నీటిని పొదుపు చేసుకోవాలి. ముందుగా నదిలోకి మళ్లించే మురుగునీటిని అరికట్టాలి.

–జీరు నరసింగరావు, కార్మికుడు, కొత్తపేట

బావుల్లో పూడిక తీస్తే మేలు



వీధి బోర్లు బాగు చేస్తున్నా నీరు లేక కష్టం వృథా అవుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా బావులలో పూడిక తీయిస్తే వర్షాలు కురిసి బావులలో నీరు చేరుతుంది. అనంతరం బోర్లలో కూడా నీరు అందుబాటులో ఉంటుంది. అయిదేళ్లకు ఒకసారి అయినా పూడిక తీయిస్తే ఇలాంటి సమయంలో ఇబ్బంది ఉండదు.

– కొంకిపూడి శంకర్, వెలంపేట

క్లుప్తంగా

162 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

తగరపువలస: ఆనందపురం మండలం శిర్లపాలెంలో అక్రమంగా మద్యం దుకాణం నిర్వహిస్తున్న బి.బంగారురాజు అనే వ్యక్తి నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 162 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ భరత్‌కుమార్ రాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది పాల్గొని నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపంపై జెడ్సీకి ఫిర్యాదు

మధురవాడ: బక్కన్నపాలెం 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనుల్లో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని రేవళ్లపాలెం వాసులు జెడ్సీ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు చేపట్టాలని టీడీపీ 6వ వార్డు ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరావు తదితరులు కోరారు. అన్నిచోట్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండటం లేదన్నారు. గతంలో ఇళ్ల ముందు నీరు నిల్వకుండా వేసుకున్న గృహనిర్మాణ వ్యర్థాలనే రోడ్డు పనుల్లో వాడుతున్నారని, వాటిని తొలగించి కొత్త గ్రావెల్ లేదా ఇతర మెటీరియల్ వేయమని చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రోడ్డు పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గుర్రం జాషువాకు నివాళులు

భీమునిపట్నం: ప్రముఖ రచయిత గుర్రం జాషువా వర్ధంతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ జాషువా గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

కొమ్మాది: రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ యువకుడు గాయాలపాలైన సంఘటన బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలోని పెట్రోల్ బంకులో విధులు ముగించుకుని నవీన్ అనే యువకుడు తన ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా, నగరం నుంచి భీమిలివైపుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక యువకులు వెంటనే యువకుడిని ఆస్పత్రికి తరలించారు.

స్వీట్ బేకరీలో అగ్నిప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బీచ్‌రోడ్డు : చినవాల్తేరులోని ఏయూ అవుట్ గేటు ఎదురుగా గల మధు స్వీట్స్ బేకరీలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. సమయానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో షాపు తెరిచి న నిర్వాహకులు బల్బు వేశారు. దీంతో షార్ట్‌సర్క్యూట్ కావడంతో షాపులో మంటలు చెలరేగాయి. షాపులోని ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వాహనంతో ఘటనా స్థలికి చేరుకుని మంటలు విస్తరించకుండా అదుపులోకి తెచ్చారు. ఎవరికీ ప్రమాదం జరగనప్పటికి సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె, తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 అసిస్టెంట్ కమిషనర్‌గా నాగేంద్రకుమార్



జెడ్సీ కనక మహాలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలసిన ఏసీ నాగేంద్ర కుమార్

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 అసిస్టెంట్ కమిషనర్, రెవెన్యూ అధికారిగా టి.నాగేంద్రకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. నాగేంద్రకుమార్ కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయన గతంలో జోన్-3 ఆర్వోగా, పలాస, కాశీబుగ్గ తదితర ప్రాంతాల్లో కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటివరకు జోన్-2 ఇన్‌చార్జి ఆర్వోగా గాజువాక ఆర్వో రామనారాయణ బాధ్యతలు నిర్వహించేవారు. ఇకపై ఆయన గాజువాక జోన్ బాధ్యతలు మాత్రమే చూస్తారు.

కాలేజ్ హాస్టల్ హెచ్‌డబ్ల్యూవోగా ప్రసాద్

మధురవాడ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల యువకుల వసతి గృహం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఆర్.ప్రసాద్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈయన సీతమ్మధార నుంచి బదిలీపై ఇక్కడికి రాగా, ఇక్కడ చేసిన బ్రహ్మానందం చినగదిలి బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి. సింహాచలం నాయుడు ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా వీవీ నగర్, సిరిగుడినగర్, తాటిచెట్లపాలెం, దసపల్లా లే అవుట్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ దిశ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో..

పద్మనాభం: పద్మనాభం సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి ఫీడర్ లైన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సంబంధిత గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు తెలిపారు. ఈ కారణంగా పొట్నూరు, రెడ్డిపల్లి, శేరిఖండం, తునివలస, నరసాపురం, విజయానందపురం, చిన్నాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలియజేశారు.

మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

మధురవాడ: మధురవాడ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. దీంతో మధురవాడ, శివశక్తినగర్, ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, సాయిప్రియ గార్డెన్, వల్లీనగర్, వుడా కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

తలనొప్పిగా మారిన పూడిక తొలగింపు



చంద్రంపాలెం వైపు వెళ్లే సర్వీసురోడ్డులో రోడ్డుపై ఆవరించిన బురద



కారుషెడ్ కూడలి వద్ద నిలిచిపోతున్న వాహనాలు

పీఎం పాలెం: క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకు చేపట్టిన డ్రైనేజీల్లో పూడిక తీత పనులు వాహనచోదకులకు ఇబ్బందిగా మారాయి. పూడిక, బురద.. సర్వీస్ రోడ్డు మీదకు ఆవరించడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇరుకు రోడ్డులో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రాత్రి సమయంలో పొక్లెయిన్ సాయంతో చేపట్టాల్సి పనులను కూలీలతో చేయించడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పూడిక తొలగింపు పనులను రాత్రిపూట యంత్రాల సాయంతో చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థినులకు 'చారిటీ బాక్స్' సాయం



రూ.50 వేల చెక్ అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

బీచ్‌రోడ్డు : ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారన్న కారణంతో భర్త నిరాదరణకు గురైన ఓ తల్లి (గాజువాకకు చెందిన రేణుక) తన పిల్లల ఉన్నత చదువుల కోసం 'చారిటీ బాక్స్'ను ఆశ్రయించడంతో వారు ఆర్థిక సాయం చేశారు. పెద్దమ్మాయి బీఎస్సీ నర్సింగ్, రెండో అమ్మాయి హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నారు. వీరిద్దరి చదువుల నిమిత్తం చారిటీ బాక్స్ ప్రతినిధులు పెదవాల్తేరులోని కార్యాలయంలో గురువారం మొదటి విడతగా రూ.50 వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్స్ కోశాధికారి పొట్నూరు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ ఎంత ఆధునికత వైపు పరుగులు పెడుతున్నా ఆలోచనల్లో ఇంకా మార్పు రావడం లేదన్నారు. ప్రస్తుత సమాజంలో ఆడ, మగ అనే తేడా లేదని చెప్పారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. అయినప్పటికీ ఆడ పిల్లలు పుట్టారని భార్యను, పిల్లలను వదిలేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఈ విషయంలో సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చారిటీ బాక్స్ ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ తల్లిదండ్రుల నీడన ఆనందంగా బతకాల్సిన పిల్లలు ఇలా నిరాదరణకు గురికావడం బాధాకరమన్నారు. అందరూ లింగ సమానత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో పారిశుధ్య పనులు



డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో పారిశుధ్య సిబ్బంది గురువారం ప్రత్యేక శుభ్రతా చర్యలు చేపట్టారు. ఆదర్శనగర్‌లో డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడం, పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'ఆదర్శనగర్‌లో అడుగు పెట్టలేం..' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మి నాయుడు స్పందించారు. పారిశుధ్య సిబ్బందితో ఆదర్శనగర్‌లో డ్రైనేజీలు శుభ్రం చేయించి ఫినాయిల్, బ్లీచింగ్ చల్లించారు. ఇకపై ప్రతిరోజూ నలుగురు సిబ్బందితో ఆదర్శనగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహిస్తామన్నారు. పారిశుధ్యానికి సంబంధించిన సమస్యలు ఉంటే తనకు లేదా ఆదర్శనగర్ సచివాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం

పీఎం పాలెం: గంజాయి విక్రయించడానికి యత్నిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని నుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ ఆరో వార్డులోని మారికవలస ఓజోన్ శివార్లలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నిందితుని కోసం ఎస్ఐ కె. భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు నిఘా వేశారు. ఆ ప్రాంతంలో బ్యాగ్‌తో తచ్చాడుతున్న దమరసింగి నవీన్ (25) పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించాడు. ఎస్ఐ తన సిబ్బందితో చుట్టుముట్టి, యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌లో అమ్మకానికి సిద్ధపరిచిన 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం పనస నందివాడ గ్రామస్తునిగా గుర్తించారు. కొమ్మాదిలోని ఓ వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అతడు తెలిపాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'పల్లెవెలుగు' బైపాస్ నుంచే..

- తగరపువలస కూడలి వరకు రాని బస్సులు
- ప్రయాణికుల అవస్థలు



బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లిపోతున్న విజయనగరం-విశాఖ పల్లె వెలుగు బస్సు

తగరపువలస: విశాఖ-విజయనగరం పట్టణాల మధ్య నడిచే పల్లె వెలుగు బస్సులు తగరపువలస కూడలి మీదుగా కాకుండా బైపాస్ రోడ్డులో నుంచి వెళ్లిపోతున్నాయని స్థానిక ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల మాదిరిగా ఇవి కూడా వెళ్లిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వాస్తవానికి మెట్రోబస్సులు కూడా అంబేడ్కరు కూడలి మీదుగా రాకపోవడంతో ప్రయాణికులు సంగివలస లేదా వెంకటేశ్వరమెట్ట వద్దకు కిలోమీటరు దూరం నడిచి బస్సుల కోసం వేచి ఉండవలసి వస్తోంది. కేవలం ఎర్ర రంగులో ఉన్న సాధారణ, సిటీ బస్సులు మాత్రమే తగరపువలస కూడలి ద్వారా వెళ్తున్నాయన్నారు. పూర్వకాలం నుంచి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను కలుపుతూ ఉండే ఈ కూడలి మీదుగానే ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు అంతరరాష్ట్ర సర్వీస్‌లు నడిచేవి. జాతీయరహదారుల విస్తరణ తరువాత తగరపువలస వాసులకు బస్సులు అందుకోవడం సమస్యగా మారింది. ఇక్కడ ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించి, బస్సులన్నీ కూడలి మీదుగా నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భద్రయ్యపేటలో ఎమ్మెల్యే పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం: భద్రయ్యపేటలో పదుల సంఖ్యలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడటంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు కిడ్నీ వ్యాధికి ఎందుకు గురవుతున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు. వారు కారణాలను నిశితంగా పరిశీలిస్తారని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ భద్రయ్యపేటలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నట్టు ఎమ్మెల్యేకు తెలిపారు. నడుము, కాళ్ల నొప్పులు, నీరసం వంటి లక్షణాలతో మంచాన పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ: భద్రయ్యపేటలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ గురువారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, నాయకులు ఉన్నారు.

గ్రామదేవతలకు సారె సమర్పణ



గ్రామ దేవతల సారె ఊరేగింపులో మహిళలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరిలు, అడవివరం గ్రామ దేవతలు పైడితల్లి, బంగారమ్మ అమ్మవార్లకు గురువారం మహిళలు సారె సమర్పించారు. చీరలు, పసుపు కుంకుమలు, గాజులను శిరస్సుపై పెట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అప్పన్న తొలిపావంచా వద్ద స్వామిని దర్శించుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్ల ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.

స్టార్టప్‌లపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం అయ్యేందుకు స్థానిక డాక్టర్ వి.ఎస్. క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్టార్టప్ కార్యకలాపాలపై అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కళాశాల విద్యార్థులను ఎంటర్‌పెన్యూర్స్‌గా తయారు చేసేందుకు, వారికి అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు ఆంధ్ర యూనివర్సిటీ సహకారంతో అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇన్నోవేషన్ క్లబ్ సహకారంతో స్టార్టప్ దిశగా అడుగులు వేసి వ్యాపార అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆహబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థులకు స్టార్టప్ స్థాపించడానికి ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అరుణ కుమారి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చాముండేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, అకడమిక్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు, కామర్స్ విభాగ అధిపతి జి.రాజ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు